తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

గోశాలలో గోపూజలు

-ఎమ్మెల్యే ఆరణి, ఈఓ శ్యామలరావు

తిరుపతి,ఆగస్ట్ 27ప్రభాతవార్త: గోకులాష్టమి సందర్భంగా తిరుపతిలోని ఎస్వీగోశాలలో మంగళవారం ఉదయం గోపూజమహోత్సవం జరిగింది. సకల దేవతాస్వరూపులైన గోవులను రక్షించి, సనాతన హైందవ దర్మాన్ని కాపాడుకోవాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో ఆగమోక్తంగా కృష్ణాష్టమి ఆస్థానం

తిరుమల,ఆగస్ట్ 27ప్రభాతవార్తప్రతినిధి: గోకులాష్టమి పర్వదినం సందర్భంగా మంగళవారం ఉదయం గోగర్భమ్‌ద్యామ్ వద్దఉన్న కాళీయమర్ధన శ్రీకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. టిటిడి ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు, అన్నప్రసాదం వితరణ జరిగింది. రాత్రి ఆలయంలోని బంగారువాకిలిలో గరుడాళ్వార్ ముఖమండపంలో గోకులాష్టమి ఆస్థానం వేదోక్తంగా జరిగింది. ఆలయ అర్చకులు, వేదపండితులు ,టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓలోకనాధం దంపతులు పాల్గొన్నారు.

కాణిపాకంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

-గోశాలలో వైభవంగా గోపూజ

కాణిపాకం, ఆగస్టు 27 ప్రభాతవార్త: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకంలో ప్రతి ఏటా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఈకార్యక్రమంను దేవస్థానం గోశాలలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కె.వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్,దేవరాజులు యాదవ్, రేణుగోపాల్ యాదవ్, రాజేంద్ర యాదవ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉత్సవ ఉభయదారులు, ఆలయ ఈఓ కె.వాణి,ఆలయ అధికారులు తదితరులు ఉదయం ప్రధాన ఆలయం నుండి పూజాసామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోశాలకు తీసుకువచ్చారు. అనంతరం గోశాల వద్ద శ్రీకృష్ణుని చిత్రపటంతో పాటు గోమాత చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలోని గోమాతలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వేదపండితులు గోమాతలకు సంప్రదాయబద్ధంగా అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతలకు ఈఓ ఆలయ అధికారులతో కలసి మేతను అందించారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానంలో అమలవుతున్న గోపూజ కార్యక్రమంను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, మల్లిఖార్జున, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్టికొట్టిన యువకులు

గోకులాష్టమి సందర్భంగా కాణిపాకం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఉట్ల పండుగలో స్థానిక యువకులు, ఉత్సవ ఉభయదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈఉట్టికొట్టే కార్యక్రమంను ఆలయ ఈఓ వాణి ఉట్టికొట్టి ప్రారంభించారు.అనంతరం యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమంలోఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టారు. అలాగే చిన్నపిల్లలు రాధాకృష్ణుల వేషంలో అలరించారు.

సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం

-బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు -ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనం -జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

కాణిపాకం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కాణిపాకం దేవస్థానంలో సెప్టెంబర్ 7 నుండి జరుగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, జిల్లా ఎస్పీ మణికంఠచందోలు, ఆలయ ఈఓ కె.వాణిలతో కలసి వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో మంగళవారం స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో సెప్టెంబర్ 7 నుండి 27 వరకు 21 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బి, విద్యుత్, ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ, అగ్నిమాపకశాఖ తదితర శాఖలు సమన్వయంతో చేపట్టి విజయవంతం చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సెప్టెంబర్ 2 లోగా పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు తగినంత మందితో సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు సంప్రదాయ రీతిలో వైభవోపేతంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో తగు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి భక్తునికి స్వామివారి దర్శనం సంతృప్తికరంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ వివిధ రహదారుల్లో వున్న గుంతలు పూడ్చడం,మలుపుల వద్ద తాత్కాలికంగా మలుపుల వద్ద లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను అరికట్టువచ్చునని తెలిపారు.సీసీ కెమెరాలు, కమాండ్ కం ట్రోల్ రూంలను ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షంచడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు ఆర్డీవో చిన్నెయ్య, ఆలయ ఉభయదారులు కమిటీ ఛైర్మన్ మణినాయుడు, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, ఈఈ వెంకట నారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు, తహశీల్దార్ మహేష్‌బాబు, ఎంపీడీఓ నాగరాజు, చిత్తూరు రూరల్ సీఐ శ్రీదర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీదర, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఆదాయం ఎక్కువ ప్రజలకు సౌకర్యాలు తక్కువ

పాకాల సబ్ రిజిస్టర్ కార్యాలయాం

పాకాల, ఆగస్టు 27, ప్రభాతవార్త పాకాల మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయానికి చుట్టు పక్కల ఉన్న 6 మండలాల ప్రజలు నిత్యం రిజిస్ట్రేషన్ల కొరకు మండల కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కి వస్తుంటారు. ఇక్కడ నిత్యం కోట్లాది రూపాయిల భూముల క్రయ విక్రయాలు జరుగుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక వనరులో ఒకటిగా ఈ కార్యాలయం ఉన్నది. ప్రజలకు కానీ కార్యాలయంకి వసతున్న వారికి గాని కనీస వసతి త్రాగటానికి మంచినీళ్లు, ఎండకు నీడ వర్షం వస్తే నిలబడటానికి కొంచం చోటు కూడా లేకపోవటం బాధాకరం. ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు, నిత్యం ఇక్కడికి రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే మహిళలు గాని మహిళ ఉద్యోగులకు కనీసం బాత్రూం, టాయిలెట్ సౌకర్యం లేకపోవడం వలన వీరు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి టాక్స్ వసూలు చేసే ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పనంలో తీవ్రంగా విఫలమైనది ప్రజలు అంటున్నారు. ఇకనైనా ఎన్‌డ్‌ఎ కూటమి ప్రభుత్వ పెద్దలు దీనిపై దృష్టి సారించి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో నూతనంగా భవనం నిర్మించాలని ప్రజలు కోరుచున్నారు. ప్రతి నిత్యం కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే ప్రజల వాహనాలకి పార్కింగ్ సౌకర్యంలేని కారణంగా మెయిన్ రోడ్ పై పార్కింగ్ చేస్తున్నారు. దీని వలన స్థానిక షాప్ యజమానులకు సామాన్య ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిన్నింటికి వీలైనంత త్వరగా పరిష్కారం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

స్వర్ణముఖిలో యధేచ్ఛగా ఇసుక తరలింపు

- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు
- అక్రమ ఇసుకను అడ్డుకోవాలన్న ఎస్పీ ఆదేశాలు బేఖాతర్

నాయుడుపేట, ఆగస్టు 27 ప్రభాతవార్త

స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోగా, పచ్చజెండా ఊపినట్లుగా ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఇచ్చిన ఆదేశాలు అధికారులు బేఖాతరు చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లతో తరలించేస్తున్నా అడ్డుచెప్పే వారే లేరని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. అలాగే నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు ఇసుక తరలిపోతున్నా అడ్డేలేదన్నట్లుగా పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక సరఫరాకు సంబంధించి కొత్త విధానం తీసుకొచ్చినా ఈ ప్రాంతంలో ఇసుక దోపిడీదారులదే రాజ్యం అన్నట్లుగా ఉంది. పెళ్లకూరు మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే చర్యలు చేపట్టకపోవడంతో స్వర్ణముఖి నదిలోని ఇసుకను ఇష్టారాజ్యంగా దోపిడీ చేసి అక్రమార్కులు లక్షలు సంపాదిస్తున్నారన్న విమర్శలున్నాయి. సుమారు 25 ట్రాక్టర్లతో స్వర్ణముఖి నదిలోని ఇసుకను దోపిడీ చేస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా ఉందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్దేశించిన గడువులోపు నిబంధనలు మేరకు బదిలీలు చేపట్టాలి

తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 27, ప్రభాతవార్త నిర్దేశిత గడువులోపు నిబంధనలు మేరకు బదిలీలు చేపట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభఉత్వం బదిలీలపై ఆంక్షలు సడలించి కొన్ని ముఖ్య శాఖలలో బదిలీలకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో జిల్లాలో పలు శాఖలలో జిఓ మేరకు బదిలీల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్‌తో కలిసి మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీల నిబంధనల మేరకు ఐదు సంవత్సరాలు పూర్తి అయిన వారు కంపల్సరీ బదిలీ, రిక్వెస్ట్ బదిలీలు తదితర అంశాల ప్రభఉత్వం నుండి అందిన ట్రాన్స్ఫర్ జివోలోని నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. కంపిటెంట్ అథారిటీ వారు సదరు బదిలీలు చేపట్టాల్సి ఉంటుందని, ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లా కలెక్టర్లు కలిసి చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీటిలో రెవెన్యూ, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్, గ్రామ వార్డు సచివాలయం శాఖ, గనులు భూ గర్భ శాఖ, ఇంజినీరింగ్ సిబ్బంది అన్ని శాఖలు, దేవాదాయ శాఖ, రవాణా శాఖ, ఈఎఫ్ఎస్ అండ్‌టి, పరిశ్రమల శాఖ, విద్యుత్ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు జరగనున్నాయని తెలిపారు. డిప్యూటీ సిఈవో ఆదిశేషారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, గ్రామ వార్డు సచివాలయం అధికారిని సుశీల దేవి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయంలో గోకులాష్టమి పండుగ పర్వదినం సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారికి జరిగిన గ్రామోత్సవం

అయ్యలనాడు చెరువు వద్ద పార్కు: వాకింగ్ ట్రాక్

13న అన్నా క్యాంటిన్లు ప్రారంభం: కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తి ప్రజల ఉపయోగార్థం ఏరియా ఆసుపత్రి మార్గంలోని అన్నా క్యాంటిన్ ఎదురుగా అందమైన పార్కును ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ ఎం.రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా రెండు పర్యాయాలు మూడు సంవత్సరాల పాటు పనిచేసిన ఆయన ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన బదిలీల్లో పొన్నూరు మున్సిపాలిటికి బదిలి అయ్యారు. బుధవారం ఆయన రిలీవ్ కానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన్ను కలసిన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రి రోడ్డులోని ఆర్‌అండ్‌బి కార్యాలయం పక్కన చక్కటి ఆహ్లాదాన్ని నిచ్చే పార్కును వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు రూ.15లక్షలతో టెండర్లు పిలిచినట్లు వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి అభివృద్ధికి మూడు సంవత్సరాల పాటు ఎంతో కృషి చేసామన్నారు. గతంలో పని చేసినపుడు 'అమృత పథకంలో' అయ్యలనాడు చెరువులో బోట్ క్లబ్ వాకింగ్ ట్రాక్ కోసం రూ.75 లక్షలు మంజూరు కాగా ఆ నిధులు చాలవనటంతో వాటిని మున్సిపాలిటి ఆవరణలో పచ్చదనానికి వినియోగించామన్నారు. తాము పనిచేసిన రెండు సార్లు 'పారిశుద్ధ్యానికి' అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ంరెండు సార్లు ఉత్తమ మున్సిపాలిటి అవార్డులను సాధించామన్నారు.కాగా సెప్టెంబర్ మాసం 13వ తేది రెండు అన్నా క్యాంటిన్లు ప్రారంభానికి సర్వం సిద్ధం చేసామని తెలిపారు. తాను ంరెండు సార్లు శ్రీకాళహస్తి మున్సిపాలిటి కమిషనర్‌గా పని చేయటం తన పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానన్నారు.

పారిశ్రామిక వేత్తలు సకాలంలో జిఎస్టీ చెల్లించండి

- దేశ ఆర్థిక పురోగతిలో భాగస్వామ్యం కండి :జిఎస్టీ ఆడిట్ కమిషనర్

తిరుపతిరూరల్, ఆగష్టు27 ప్రభాతవార్త: పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సకాలంలో జిఎస్టీ చెల్లించి, దేశ ఆర్థిక పురోగతిలో భాగస్వామ్యం కావాలని కస్టమ్స్, ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ కమిషనర్ పి.ఆనందకుమార్ సూచించారు. మంగళవారం కస్టమ్స్ అండ్ జిఎస్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్రమోదీ అన్ని రకాల పన్నులు రద్దు చేసి, ఒకే దేశం ఒకటే పన్ను విధానాన్ని 2017లో జిఎస్టీని తీసుకొచ్చారని తెలిపారు. ప్రధాని మోదీ సాహసోపేతంగా 33రకాల సెస్‌లు, 17రకాల పన్నులను రద్దు చేసి, జిఎస్టీని తీసుకొచ్చారని తెలిపారు. జిఎస్టీ విధానం వల్ల పన్ను మీద పన్ను విధింపు లేదన్నారు. పన్నుల సంస్కరణలు చేసి, దేశ ఆర్థిక వ్యవస్థ 10స్థానంలో ఉన్నదానిని ప్రధాని మోదీ 5వ స్థానానికి తీసుకొచ్చారని, 3వస్థానానికి తీసుకురావడమే ప్రధాని లక్ష్యమని తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై జాగ్రత్త

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త: హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై తగు జాగ్రత్త వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సాంఘీక సంక్షేమ వసతి గృహాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలు, ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాల జిల్లా అధికారులు, ప్రిన్సిపాళ్ళు, అసిస్టెంట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో పేద తల్లిదండ్రులు వారి పిల్లలను హాస్టళ్ళ సంరక్షణలో వుంచుతారని, అలాంటి పిల్లల విద్య, ఆరోగ్యంపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వసతి గృహాల్లో వుండే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం భోజనం అందించాలన్నారు. అలాగే ప్రతి నెలా విద్యార్థులకు వైదనయ పరీక్షలు నిర్వహించాలని, పిహెచ్‌సి పరిధిలోని బాలికల వసతిగృహాలను మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు తరచు పరిశీలించి బాలికలకు అవసరమైన వైద్య సేవలు అందించి వారి సందేహాలన నివృత్తి చేయాలన్నారు. పంచాయతీ సెక్రటరీలను సమన్వయం చేసుకుని హాస్టల్ విద్యార్థులకు సురక్షితమైన మంచినీటిని ట్యాంకర్ల ద్వారా అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్ళ వద్ద రాత్రి సమయాల్లో భద్రత పక్కాగా వుండాలని కల్టెర్ ఆదేశించారు. రెసిడెన్షియల్ హాస్టల్‌లో ప్రతి రోజు రాత్రి ఇద్దరు టీచర్లు వుండటం జరుగుతుందని గురుకుల పాఠశాలల అధికారి కలెక్టర్‌కు వివరించారు. బిసీ వసతి గృహాలకు సంబంధించి వార్డెన్లు రాత్రి 9.30 గంటల వరకు హాస్టళ్ళలోనే వుండటం జరుగుతుందని బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ వివరించారు. హాస్టల్ విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వుండరాదని, అన్ని హాస్టళ్ళలో వార్డెన్లు రాత్రి ఎంత సమయం వుంటారనే విషయంను జిల్లా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వార్డెన్లతో పాటు అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు విధిగా వారానికి నాలుగు హాస్టల్స్‌ను తనిఖీ చేసి నెలలో 12 హాస్టళ్ళను విధిగా పరిశీలించాలని ఆదేశించారు. రామకుప్పం మండలంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎత్తు ప్రాంతంలో నిర్మించడం, సరైన రోడ్డు లేకపోవడంతో ప్రొవిజన్స్, గ్యాస్ తదితరాలను తీసుకెళ్ళడానికి అసౌకర్యంగా వుందని వెండార్స్ పేర్కొంటున్నారని ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అక్కడ సిమెంటు రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. చిత్తూరులో 250 విద్యార్థులు వున్న హాస్టల్‌కు బోర్ వుందని పైపులైను సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులకు సరైన నీరు అందించడానికి వీలే లేకుండా పోతందని హాస్టల్ వార్డెన్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సత్వరం చర్యలు తీసుకుని పైపు లైను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ హిమవంశి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల డిసిటిఓ పద్మజ, బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మూర్తి, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మల్లానూరు ప్రభుత్వజూనియర్ కాలేజ్ భవనాలకై స్థల పరిశీలన

కుప్పంరూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలోని మల్లానూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌కు శాశ్వత భవనాల నిర్మాణం కోసం మంగళవారం తహశీల్దార్ చిట్టిబాబు, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలకు నూతన భవనాల నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలోనే నిధులు మంజూరు కాగానే అధికారులు చూపిన స్థలంలో భవనాల నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

బిజెపి సభ్యత్వ నమోదులో ఆదర్శం కావాలి

శాంతిపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త

భారతీయజనతా పార్టీ సభ్యత్వ నమోదులో శాంతిపురం మండలం ఆదర్శంగా నిలవాలని మండల బిజెపి అధ్యక్షుడు కాశీనాథ్ కోరారు. మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడా రు. సభ్యత్వ నమోదు సెప్టెంబర్ రెండో తేది నుంచి ప్రారంభమవుతుందన్నారు. అధిష్టానం ఆదేశాలతో గ్రామసాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు నేతలు కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024నెంబరుకు మిస్‌కాల్ ఇస్తే చేయాలన్నారు. ప్రధాని మోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నేతలు గజే ంద్ర,సుబ్రమణ్యం, సుధాకర్, కుమార్, కదిరివేలు, మంజునాథ్ పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబును కలసిన తెదేపా నేతలు

శాంతిపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త

శాంతిపురం మండలంకు చెందిన పలువురు నేతలు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. ఉ ండవల్లిలోని సిఎం నివాసంలో వారు కలసి ముఖ్యమంత్రికి మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు చంద్రారెడ్డి, నాగరాజు, రమేష్, శివశంకర్, సింగిరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

రామకుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలోని విజలాపురం సమీపంలో విమానాశ్ర యం నిర్మాణానికి రైతులు సహకరించాలని తహశీ ల్దార్ బాబు కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతులు, దేశం నేతలతో ఆయన మాట్లాడారు. విజలాపురం, కిలాక్ పోడు, కృష్ణరాజపురం, మణీంద్రం తదితర గ్రామాల రైతులు భూసర్వేకు సహకరించాలన్నారు. అమ్మవారిపేట వద్దగల ప్రభుత్వ భూములకు సంబంధించి సర్వే నెంబర్లను ప్రతిపాదించామన్నారు. అనాదిగా బీడుగాఉన్న భూములపై సమగ్ర సర్వేకోసం ఎనిమిది మంది డిటిలు, సర్వేయర్లను నియమించారన్నారు. కుప్పంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆన ందరెడ్డి, నేతలు శ్రీరాములురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, వెంకటరమణ, రఘు, మురళి, సుబ్రి, బాలరాజు, భాస్కర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

వి.కోట, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలోని కరిప్పల్లి గ్రామంలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కరిప్పల్లికి చెందిన ఆనందప్ప బీన్స్ తోటలో గంజాయి మొక్కలు సాగు చేసేవాడు. రామకుప్పం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తేనె, ఇతర మూలికల కోసం ఆనందప్ప పొలాల వద్ద గాలించగా వారికి గంజాయి మొక్కలు కన్పించాయి. దీంతో సోమవారం రాత్రి గంజాయి మొక్కలు కోసుకుని పరారవుతుండగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. కాగా ఆనందప్ప పొలంలో పరిశీలించగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు.

ఆర్ఎంపీలు కేవలం ప్రథమచికిత్సకే పరిమితం కావాలి

పెద్దపంజాణి ఆగష్టు27 ప్రభాతవార్త :

ఆర్ఎంపీ,పిఎంపీ వైద్యులు కేవలం ప్రథమచికిత్సకే పరిమితం కావాలని ఇష్టారాజ్యంగా రానిపోని వైద్యసేవలు ప్రజలకుఅందిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పెద్దపంజాణి వైద్యాధికారి డా॥ మురళీ పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగాఉన్న పలుఆర్ఎంపీ,పిఎంపీ కేంద్రాల్లో ఆయన ఆకస్మికతనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రజలు జ్వరం లేదా ఇతరవ్యాదులతో వస్తే కేవలం ప్రథమచికిత్స చేసి ప్రభుత్వఆసుపత్రికి పంపించాలని సూచించారు. రోగులకు ఇంజెక్షన్లు వేయడం సెలైన్లుఎక్కించడం చిన్నచిన్న ఆపరేషన్లు నిర్వహించడం వంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. మందులు మాత్రలుకూడా విపరీతమైన డోసేజిలతో ఇస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని వీటిపైచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామీణప్రజలు తమ ఆరోగ్యాలు కాపాడుకునేందుకు ఆర్ఎంపీలవద్దకువస్తే అలాంటివారివద్దనుంచి వేలాధిరూపాయలు చికిత్సనిమిత్తం గుంజుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఎంపీ,పిఎంపీ కేంద్రాల్లో ప్రథమచికిత్స కేంద్రాలని బోర్డులు పెట్టుకోవాలని కీనిక్లలంటూ బోర్డులుపెడితే చట్టపరమైన చర్యలుతప్పవని హెచ్చరించారు. ఇటీవలకాలంలో ఆర్ఎంపీలు,పిఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రజలప్రాణాలు పోయేస్థితికి వైద్యసేవలు అందిస్తున్నారని ఇదిఏమాత్రం మంచిపద్ధతికాదని హెచ్చరించారు. ప్రజలప్రాణాలు కాపాడేందుకు ఆర్ఎంపీలు,పిఎంపీలు కృషిచేయాలని సూచించారు. ఆర్ఎంపీ,పిఎంపీ కేంద్రాల్లో ఏదైనా మరణాలు సంభవించినట్లు తమదృష్టికి వస్తే అటువంటి వైద్యులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు రీజియన్ స్టార్టప్‌పిచ్ పోటీలకు కెఇసి ఆతిథ్యం

– కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్

కుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్, అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్)అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐడియాథాన్/రూరల్ స్టార్టప్ పిచ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ పేర్కొన్నారు. ఈ పోటీలకు సంబంధించి చిత్తూరు రీజియన్ పోటీలకు తమ కళాశాల ఆతిథ్యం ఇస్తుందన్నారు. మంగళవారం ఈ పోటీలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ స్టార్టప్ పిచ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌కు దక్కడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రాంతీయ స్టార్టప్ పిచ్ పోటీలు సెప్టెంబర్ 13న జరుగుతాయన్నారు. విజేతలుగా నిలిచిన జట్లు సెప్టెంబర్ 30నుంచి అక్టోబర్ 4వతేది వరకు అంకుర స్టార్టప్ బస్సు యాత్రలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు వినూత్న ఆలోచనలతో ఈవెంట్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్,హెచ్ఒడిలు గణేష్, డా॥ శేఖర్, ఈవెంట్ కోఆర్డినేటర్ డా॥ అజయ్, డా॥ సంతోష్ పాల్గొన్నారు

పేదల కంటి సమస్యల పరిష్కారానికే కంటి వెలుగు కార్యక్రమం

– మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

కుప్పంరూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త

పేద ప్రజల కంటి సమస్యల పరిష్కారానికే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కంటి వెలుగు కార్యక్రమం చేపడుతున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని మల్లానూరు, పైపాళ్యం గ్రామాల్లో ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ, కంటికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అనంతరం కాన్పులకు సంబంధించి జిల్లాలో మొదటిస్థానంలో ఉన్న మల్లానూరు పిహెచ్‌సి డా॥ ఉషాకిరణ్‌ను, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, మాజీ ఎంపిపి సాంబశివం, మాజీ సర్పంచులు రామచంద్ర, వల్లెప్ప, నేతలు దామోదర్, రమేష్, వెంకటాచలపతినాయుడు,రాజ్‌కుమార్, అన్నాదొరై, ప్రకాష్, విభూషణ్, డా॥అర్పిత, డా॥ సుభాష్‌రాజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

భద్రత సంరక్షణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సిఐ

చౌడేపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త

వ్యక్తిగత భద్రత, ఆస్థి సంరక్షఖ కోసం సిసి కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పట్టణంలోని దుకాణదారులతో సమావేశం జరిగింది. ప్రభుత్వం తీసుకురాబడిన 2013చట్టం ప్రకారం ప్రజా భద్రత కోసం దుకాణాల వద్ద సిసి కెమరాలు అమర్చుకోవాలని తెలిపిందన్నారు. వాటితోపాటు ఆరాధనా మందిరాలు, దేవాలయాలు, మాల్స్ వద్ద ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసారు. రాత్రిళ్ళు సైతం కనిపించేలా మంచి రెజుల్వేషన్ గల కెమరాలు, నెల రోజుల పాటు బ్యాక్‌అప్ వచ్చే విధంగా ఫుటేజీలు పెట్టుకోవాలన్నారు. అనుమానిత వస్తువులు, వ్యక్తులు, వాహనాలు వంటివి కంట పడితే వెంటనే సమీపంలోని పోలీస్టేషన్‌కు సమాచారమిచ్చి సహకరించాలన్నారు. అనంతరం సిసి కెమరాలు ఎక్కడెక్కడ ఎలా అమర్చాలన్న విషయాలపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. పట్టణం మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షుడు బొగ్గరపు కృష్ణమూర్తి(కిటెక్స్) దుకాణదారులు పాల్గొన్నారు.

చిత్తూరులో పురసం కవులకు సన్మానం

పుంగనూరు,ఆగస్టు 27 ప్రభాతవార్త

తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా పుంగనూరు కవులకు చిత్తూరులో మంగళవారం సత్కారం జరిగింది. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గిరిధరన్ అధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో వివిధ మండలాల కవులు,రచయితలు పాల్గొన్నారు. గిడుగు వ్యవహారిక భాషాశైలిపై జరిగిన కవిసమ్మేళనంలో పుంగనూరు రచయితల సంఘానికి చెందిన కవులు హసీనాబేగం,సతీష్‌కుమార్‌లు కవితలు వినిపించారు. జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు,కట్టమంచి బాలకృష్ణారెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

భారతీయ జనతాపార్టీను బలోపేతం చేద్దాం.

పుంగనూరు,ఆగస్టు 27 ప్రభాతవార్త

భారతీయ జనతాపార్టీను బలోపేతం చేయడానికి ప్రతి కార్ యకర్త బాధ్యతతో వ్యవహరించాలని పార్టీనియో జకవర్గ కన్వీనర్ మదన్‌మోహన్ అన్నారు. మంగళ వారం పట్టణంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మరంబాబు అధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో భాజాపా పట్ల ప్రజలు దశాబ్దాలుగా అనుబంధాన్ని సాగిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. దివంగత నాయకుడు వెంకటమునివేలు పార్టీకు పట్టణంలో జీవం పోశారని, ఆతరువాత పలు సందర్భాలలో పార్టీకు ఎన్నికలలో మంచి ఓటింగ్‌శాతం వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాజంపేట ఉపాధ్యక్షురాలు మల్లికారాణి,నర్సింహులు,రాజాజెట్టి,శంకర్,టివిఎస్ ప్రసాద్,నాగరాజ,బుజ్జి, కృష్ణమూర్తి, మహేష్, సుధారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమిస్తున్నారు చర్యలు తీసుకోండి మహాప్రభో...!

చౌడేపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త

చెరువును దాని వనరులను ఆక్రమించి దున్నేస్తున్నారు చర్యలు తీసుకోండి మహాప్రభో అంటూ.. .రైతులు రెవిన్యూ అధికారులను ఆశ్రయించారు. రైతు కథనం మేరకు...మండంలోని పరికిదొన పంచాయతీ చిన్నకంపల్లి వద్దగల సర్వేనంబర్ 226లోగల దామరాకుల చెరువును ఒకవ్యక్తి దురాక్రమణ చేసి మట్టిని తోలుకొంటున్నాడని ఆయకట్టు రైతు జి.వెంకట్రమణారెడ్డి తెలిపాడు. అంతే కాకుండా చెరువుకు నీరందించే ప్రధాన వనరులను సైతం దున్నేస్తున్నారన్నాడు. చెరువు కింద 10ఎకరాల ఆయకట్టు 12మంది రైతులన్నామన్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ హనుమంత్ నాయక్‌కు వినతి పత్రమందించారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎండేకోటం ప్రభుత్వానికే సాధ్యపడుతుందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు బుదురు గురవయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ రావడంతో నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణా సంచాల నడుమ పూలమాలలు శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పంచాయితీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుంది అన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించి అధికారుల సాయంతో వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సర్వసభ్య సమావేశంలో చర్చించారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య పారిశుద్ధ్యం వీధి దీపాలు విషయంలో ఎక్కడ కూడా రాజీ పడకుండా అధికారులు నాయకులు పనిచేయాలన్నారు. నాయకులు మరికొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఊటుకూరు యామిని, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటే శ్వర రాజు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

కోట, ఆగస్టు 27 ప్రభాతవార్త

దివంగత మాజీ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐ.గోపాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కళాశాలలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బికెఆర్ కళాశాలకు తొలి ప్రిన్సిపాల్‌గా, డైరెక్టర్‌గా, ఛైర్మన్‌గా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన సేవలను గుర్తించిన వివిధ విశ్వవిద్యాలయాలు మూడుసార్లు గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందించాయని చెప్పారు. ఆయన భౌతికంగా లేకపోయినా విద్యార్థుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. కళాశాల అభివృద్ధికి నాటి దివంగత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సహకారంతో రామ్‌కుమార్‌రెడ్డి ప్రోత్సాహంతో కళాశాలను మంచి మార్గంలో నడిపించారని కొనియాడారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు

పిడి శ్రీనివాస ప్రసాద్

బాలాయపల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త

ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆకసముద్రం, వెంగమాం బవురం గ్రామ పంచాయితీలో కయ్యూరు చెరువుల్లో జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. 300 రూపాయలు కూలి రావడానికి కూలీలతో కనీసం 20 నిమిషాల పాటు నిలబడి తవ్వించి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమూనికి ఏపివో మృత్యుంజయరావు, ఈసీ కరుణాకర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు అయ్యారు.

ఘనంగా వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కళ్యాణం

వెంకటగిరి, ఆగస్టు 27, ప్రభాతవార్త

పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న సుబ్రమణ్యం స్వామి ఆలయ సమీపంలో ఉన్న సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఘనంగా వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కళ్యాణం ఘనంగా జరిగింది. కళ్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. ఘనంగా కళ్యాణోత్సవం జరిగింది.

పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 27, ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళల అండగా ఉంటానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి సమస్యలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వారి అరాచకాలు ఎక్కువయ్యాయని ఆయన ఎదుట నాయకులు ఆందోళన చెందారు. తమ పై దౌర్జన్యాలు దాడులు ఆస్తులు ధ్వంసం వంటివి టిడిపి వారు చేస్తున్నట్లు రాంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని తాను అండగా ఉంటానని తెలిపారు. న్యాయ పరంగా ఎదుర్కొంటామని చెప్పారు. తనను ఎప్పుడైనా వచ్చి కలవవచ్చునని తెలిపారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస రెడ్డి, రాజారెడ్డి, కోన మల్లికార్జున, పేజి రాజ్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చింతవరం హైస్కూల్‌కి మైక్‌సెట్ వితరణ

చిల్లకూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త

మండల పరిధిలోని చింతవరం గ్రామంలో ఏర్పాటై ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం అదే గ్రామానికి చెందిన సెనగపల్లి సుందర్ రాజా అనే వ్యక్తి పాఠశాలకు 20 వేల రూపాయలు విలువచేసే మైక్ సెట్ ఉచితంగా అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు పాఠశాలకు కావాల్సిన కనీస వసతులు కోసం సహాయ సహకారాలు అందించాలని వారు తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యంతో పాటు ఉపాధ్యాయులు సుందర్ రాజను ఘనంగా అభినందించారు. ఎంపిటిసి పాలూరు మాధవి, సర్పంచి జోగి సుగుణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివిసత్రంలో ఇసుక మాఫియాను ఆపేదెవరు

– పట్టించుకోని ఎస్ఈబి, స్థానిక పోలీసులు

దొరవారిసత్రం ఆగస్టు 27 ప్రభాతవార్త;

దొరవారిసత్రం మండలంలోని కాళంగినది నుండి కొంతమంది అక్రమార్కులు ఇసుక మాపియాకు పాల్పడుతున్న ఈ మాఫియాను ఆపేదెవరని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని వెదురుపట్టు, తనయాలి, వేటగిరిపాళెం, మోదుగులపాళెం గ్రామాల సమీపంలో ఉన్న కాళంగినది నుండి ప్రభుత్వ నిభంధనలకు విరుద్దంగా రాత్రిసమయంలో ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తరళిస్తూ మాపియాకు పాల్పడుతున్న నియంత్రించడంలో ఎస్ఈబి-పోలీసులు విఫలమౌతున్నారన్నా విమర్శలు ప్రజల నుండి వ్యక్తమౌతున్నాయి. సూళ్ళూరుపేట ప్రాంతంలో ఇసుకకు మంచిగిరాకీ ఉండటంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. ఈవిధంగా కాళంగినదిలో రాత్రిసమయంలో ఇసుకను తవ్వేయడం వల్ల భూగర్భ జల్లాలు అడుగంటిపోయి వ్యవసాయ మోటార్లకు నీరందక అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు, ఎస్ఈబి అధికారులకు ఫిర్యాదుచేసిన వారు మాత్రం పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాఉన్నతాధికారులు స్పందించి దొరవారిసత్రం మండలంలో జరుగుతున్న ఇసుక మాఫియాను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర నినాదంతో మొక్కులు పంపిణీ

గూడూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త

గూడూరు నియోజకవర్గంలో సెప్టెంబర్ 2వ తేది ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జనసేన పార్టీ కార్యాలయం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర రావు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని అందులో భాగంగా మండల నాయకులకు నేరేడు, వేప, రావి మొక్కలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో ఉచితంగా మొక్కలు అందుబాటులో ఉంచడం జరిగిందని, మొక్కలు కావాల్సిన జనసేన నాయకులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఓసి మోహన్, నాయకులు మనోజ్ కుమార్, మహేష్, కార్తీక్, సాయి, తిరుపాల్, సుమన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి సభ్యత్వాలను అత్యధికంగా నమోదు చేయాలి

వి.కోట, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వాలను అత్యధికంగా నమోదు చేయాలని మండల బిజెపి అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక ంగా జరిగిన కార్యకర్తల సమావేశానికి జిల్లా కార్యదర్శి ప్రభాకర్, అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 2 నుంచి సభ్యత్వాలు నమోదు చేస్తామన్నారు. ప్రతిబూత్ పరిధిలో రెండువందల సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు రవికుమార్, నవీన్‌కుమార్‌రాజు, బంగారురెడ్డి, సత్యన్న, ఉషారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ సుమన్ మెరుపు దాడి

– ఇసుక, టపాకాయలు, అక్రమ మద్యం స్వాధీనం

శ్రీరంగరాజపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త:

ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సుమన్ మండలంలో మంగళవారం మెరుపుదాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న ఇసుక, అక్రమ మద్యం, అక్రమంగా నిల్వ వుంచిన టపాకాయలను స్వాధీనం చేసుకుని అక్రమదారుల గుండెల్లో రైళ్ళు పరుగె

సన్నిధివీధిలో అన్నదానం

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం నాలగవ గేటు సమీపంలో వెలసిన శ్రీకృష్ణమందిరంలో గోకులాష్టమి సందర్భంగా మంగళవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలను మాజీ కౌన్సిలర్ రవికుమార్,మణి కుమార్‌ల సారధ్యంలో భక్తులు నిర్వహించారు.ఇక్కడ దశాబ్దాల క్రితం శ్రీకృష్ణుని మందిరాన్ని ఏర్పాటు చేసారు. దిన దినాభివృద్ధి చెందుతున్న సన్నిధి వీధిలో ఆలయానికి ప్రతి రోజూ వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ భక్తుల సౌకర్యార్థం అన్నదానం కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.

కరాటే పోటీల్లో అక్కా చెల్లెళ్ళకు బహుమతులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి చెందిన చిన్నారులు చిచ్చర పిడుగులా మారారు. ఎక్కడ ఏ పోటీ జరిగినా అక్కడ పాల్గొని విజేతలౌతున్నారు.అవార్డులు సాధించి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఆంధ్ర సరిహద్దులోని తమిళనాడుకు చెందిన పొన్నేరిలో నిర్వహించిన ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన కరుణాకర్ గుప్తా కుమార్తెలు అక్కా చెల్లెళ్ళు చాతుర్యాశ్రీ, మాధురి శ్రీలు పాల్గొని విజేతలుగా నిలిచారు. బహుమతులతో పాటు ట్రోఫిలు, ప్రసంశా పత్రాలు సాధించారు. వారికి భాస్కరన్ శిక్షణ ఇచ్చారు. వారిని నిష్ణాతులుగా కరాటేలో మెలుకులతో పాటు పోటీల్లో ఎలా విజేతలు కావాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు పొన్నేరిలో విజయం సాధించిన కోట మాధుర్యశ్రీ ప్రథమ స్థానం సాధించగా చాతుర్యశ్రీ తృతీయ బహుమతిని ౧గెలుచుకున్నారు. శ్రీకాళహస్తిలోని ఇన్సిట్యూట్‌లో వారికి భాస్కరన్ అధ్యక్షతన అభినంద సభ ఏర్పాటు చేసారు.కరాటే విద్యార్థులు హాజరయ్యారు.మాస్టర్ సంపత్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

ప్రమాదకరపరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రం

–పరిశీలించిన ఎఈ, సూపర్‌వైజర్

.తొట్టంబేడు, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇక్కడి కేంద్రంలో సుమారు 21మంది చిన్నారులు ఉంటున్నారు. అయితే ఇది ఎప్పటి నుంచో ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రం శ్లాబు పైపెచ్చులు రాలి చిన్నారులపై పడే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని పాత్రికేయులు సిడిపిఓకు తెలిపగా వెంటనే స్పందించిన ఆమె సూపర్‌వైజర్ రాజేశ్వరి పంచాయతీరాజ్ ఎఈలతో కలసి పరిశీలించారు. దీంతో భవన నిర్మాణా న్ని పరిశీలించి కట్టడిబాగోలేదని త్వరలోనే కూలుతుందని ఎఈ తెలిపారు. కాగా ఈఈ కూడా వచ్చిపరిశీలించినఅనంతరంఇప్పుడున్న భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతామని అంతవరకు తాత్కాలిక భవనం ఎంచుకుని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూపర్‌వైజర్ రాజేశ్వరి సూచించారు.అంగన్‌వాడీ టీచర్ సురేఖ, హెల్పర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలియకుండానే పనులు చేసేస్తున్నారు?

.తొట్టంబేడు, ఆగస్టు 27 ప్రభాతవార్త

పంచాయతీలో తనకు తెలియకుండానే కొందరు పనులు చేసి గ్రామంలోని ప్రజల వద్ద ఇంటింటికి వెళ్ళి నగదు వసూలు చేస్తున్నారని ఇక తాను సర్పంచ్‌గా ఉండేదెందుకని బోనుపల్లి సర్పంచ్ వి.సిద్దయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన గ్రామంలో జరుగుతున్న పనులను గురించి ఎంపిపి ఉన్నం నిర్మల, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడుకు తెలిపి ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అందుబాటులో మినల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారని ఇది అందరికీ అందుబాటులో ఉందన్నారు. అయితే కొద్దిరోజుల క్రితం మోటారు మరమ్మత్తులకు గురవగా దీన్ని చేయించి కొందరు ఇంటింటికి నగదు వసూలు చేసుకోవడంతో పాటు తన వద్ద కూడా నగదు తీసుకున్నారని అనంతరం చెక్కులపై సంతకాలు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారని, అందుకే తాను రాజీనామా చేస్తానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి జరగకుండా చూస్తామని అవసరమైతే ఈవిషయాన్ని స్థానిక ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని ఉన్నం వాసుదేవనాయుడు తెలిపారు.

అటవీశాఖాధికారిని సత్కరించిన జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారి లోకేష్‌ను మంగళ వారం జనసేనన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయంలో మర్యాదపూ ర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాన్ని అందించారు. కాగా శ్రీకాళహస్తికి మంజూరైన కైలాసగిరి నగరవనం గురించి అటవీశాఖాధికారితో చర్చించారు. జనసేన నాయకులు కుమార్, చిరంజీవి, డిల్లీబాబు, మరియు జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 ప్రభాతవార్త

రాబోవు సెప్టెంబర్ 14వతేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ పిలుపునిచ్చారు. అన్నిశాఖల సహకారంతో రాబోవు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. న్యాయస్థానంలో లేదా వ్యాజ్యానికి ముందు దశలో పెండింగ్‌లో ఉన్న వివాదాలు, కేసులు సామరస్యంగా పరిష్కరించుకుని రాజీచేసుకునే మంచి అవకాశం లోక్ అదాలత్ ఒక్కటే అన్నారు. ఇక్కడ ఇచ్చే తీర్పు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పుతో సమానం అన్నారు.సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణ ప్రియ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియులకు ప్రత్యేక స్థానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి వన్నెకుల క్షత్రియ సంక్షేమ భవన్‌లో అందుబాటులో ఉన్న ముఖ్య వన్నెకుల క్షత్రియ నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులందరు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం రావడం జరిగిందని మరి స్థానిక శాసన సభ్యులు సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు వన్నెరెడ్డి సోదరులు పెద్దఎత్తున తెదేపాను అదరించారని ఎన్నికలకు ముందు సుధీర్‌రెడ్డి ఊరందూరులో ఫాస్ట్‌విత్ వన్నెరెడ్డి నాయకులతోసమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. వన్నెకుల క్షత్రియ సోదరుల కోసం రాజకీయంగా కూడా పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవుల్లో జనాభా దామాషా ప్రకారం ముఖ్యనాయకులు కొందరితో మాట్లాడుకుని మీద్వారానే పేర్లు తీసుకుంటామని అధిష్టానానికి పంపి రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారిగురవారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మిన్నల్‌రవి, సీనియర్ పార్టీనాయకులు పేటబాలాజీ, రాష్ట్ర యువత నాయకులు ప్రతాప్‌రెడ్డి, పార్లమెంటు బిసి నాయకులు ఎంఎస్‌రెడ్డిలు పాల్గొన్నారు..

ప్రజలు అందించే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయండి

కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 27, ప్రభాతవార్త

మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు అందించే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి, పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ సమావేశం మందిరంలో అన్ని విభాగాల అధికారులతో మీ కోసం పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలన్నారు. వీలైనంత వరకు అర్జీదారుని సమస్యను పరిష్కరించేందుకు చూడాలని అన్నారు. కానీ పక్షంలో ఎందుకు పరిష్కారం కాలేదనే విషయాన్ని స్పష్టంగా వారికి తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వం పిజిఆర్ఎస్ పై ప్రత్యేక దృష్టి సారించిందని, సకాలంలో స్పందించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అదనపు కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కెఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాస రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు ఎస్‌వి వైద్య కళాశాలలో..

తిరుపతి హెల్త్, ఆగస్టు 27, ప్రభాతవార్త నీట్ ఎంబీబీఎస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వైద్య విద్యార్థులకు అడ్మిషన్లు మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజైనా ఆల్ ఇండియా కోట క్రింద ఉత్తమ ఫలితాలు సాధించి, ఎస్‌వి వైద్య కళాశాలలో చదువుకోవాలన్న ఒక కృత నిక్షయముతో, ఆల్ ఇండియా ర్యాంకు సాధించి ఎంబిబిఎస్‌లో చేరడం జరిగింది. వారు వాళ్ళ తల్లిదండ్రులు ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆధ్యా సింగల్ న్యూఢిల్లీ, ప్రియాంషు, హర్యానా, మార్షల్ మండ్రో, న్యూఢిల్లీ, మానస్ గాన్లేవార్, నాందేడ్ మహారాష్ట్ర, లివింగ్ జాయ్, కేరళ రాష్ట్రం మొదటి రోజు వీరు అడ్మిషన్లు తీసుకుని, వైద్య విద్యను బాగా అభ్యసించి, ఎస్వీ వైద్య కళాశాలను ప్రపంచ పటంలో చూసుకోవాలని, ఆంధ్రప్రదేశ్, తిరుపతి పట్టణంలోని ఎస్‌వి వైద్య కళాశాలలో మా వైద్య వృత్తి ప్రయాణాన్ని సాగిస్తాము, పిజీ కూడా ఇక్కడే చదువుకుంటామని, ఆల్ ఇండియా కోట వైద్య విద్యార్థులు సంతోషం వ్యక్త పరిచారు. ఎస్వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్‌మూర్తి, అరుణ్ బాబు, ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

పుత్తూరు ఆర్టీసీ డిపో నుంచి రేణిగుంట మీదుగా ఏర్పాటు చేయాలి

– డిపో మేనేజర్‌కి వినతి

పుత్తూరురూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రజలు, కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారికి బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. సీపీఎంనాయకులు మాట్లాడుతూ పుత్తూరు పట్టణం నుంచి ప్రయాణికులు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు, శ్రీకాళహస్తి దేవస్థానానికి వెళ్లే వారు అదే విధంగా కాలేజీవిద్యార్థులు వారి ఇళ్ళకు ప్రయాణికులు చేయడానికి పల్లె వెలుగు బస్సులను ప్రజలకు ఉద్యోగస్తులకు, విద్యార్థులకు ప్రయాణికులకు అందుబాటులో తీసుకురావాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ని కోరారు. దానికి మేనేజర్‌స్పందించి నేటి నుంచి ఆ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, భాస్కర్, బాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు తదిరతులు పాల్గొన్నారు.

నిరుపేదలను గుర్తించి వారికి అవగాహన కల్పించి సంఘాల్లో చేర్పించాలి - ఏపీఎం

పుత్తూరురూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త:

మండలంలోని నిరుపేదలను గుర్తించి వారికి అవగాహన కల్పించి సంఘాల్లో చేర్పించాలని ఏపీఎం తెలిపారు. పుత్తూరు మండలం జనరల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండలంలోని 26 సంఘాల ఈసీ సభ్యులు, 69 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పేదల నిరుపేదలను గుర్తించి ఇంకను సంఘాల్లో చేరకుండా వాళ్ళని గుర్తించి వారికి అవగాహన కల్పించి సంఘాల్లో చేర్పించాలని తెలిపారు. ప్రతి వీవో లీడర్లు లావాదేవీలపై నిఘా పెట్టాలని, ఎక్కడ తప్పొప్పులకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలని తెలిపారు. సంఘాలను జాగ్రత్తగా చూసుకోవాలని, గతంలో జరిగిన తప్పొప్పులు లాగా ఇప్పుడు జరగకూడదని, అందరికి అవగాహన కల్పించాలని, ప్రతి సభ్యురాలు నష్టపోకుండా అభివృద్ధి బాటలో నడుచుకోవాలన్నారు. సంఘాలను బలోపేతం చేసుకుని మన అభివృద్ధికి పెద్దపీఠం వేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా స్త్రీ నిధి, సీఐఎఫ్‌ల ద్వారా తీసుకున్న రుణాలను జీవనోపాదులు అభివృద్ధికి ఖర్చు చేసి ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చెప్పడం జరిగిందన్నారు. ఈ జనరల్ బాడీ మీటింగ్‌లో కొత్తగా ఎంఎస్ఎస్‌కు అధ్యక్షురాలుగా టి.శకుంతలమ్మ, కార్యదర్శిగా రాజేశ్వరి, కోశాధికారిగా అమ్ములను ఎన్నుకోవడం జరిగిందన్నారు. వైఎంఎస్ లీడర్లుగా వై.హేమ, అధ్యక్షురాలు చిట్టెమ్మ, కార్యదర్శిగా శాంతి, కోశాధికారిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఎంపీపీ మునివేలు, ద్వాక్రా సంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

సహజ వాయువు వినియోగ భాగస్వామిగా మారిన

ఏజీఅండ్‌పి ప్రథమ్ సంస్థ

తిరుపతి విద్య, ఆగస్టు 27, ప్రభాతవార్త

భారతదేశంలోని ప్రముఖ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ అయిన ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ తిరుపతి, శ్రీ సిటీ యొక్క ఇంధన అవసరాలను పునరావిష్కరించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తిస్తూ సమగ్ర గ్యాస్ పైప్ లైన్ నెట్ వర్క్‌ను అభివృద్ధి చేయటం ప్రారంభించింది అని అన్నారు. స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ తిరుపతి పారిశ్రామిక, వాణిజ్య, నివాస రంగాలకు ఆధారపడి తక్కువ ఖర్చుతో కూడిన, పర్యావరణ అనుకూల సహజ వాయువు ఆత్మాభ్యలను అందించడమే ఈ ప్రాజెక్టు యొక్క లక్ష్యం. ఇటీవల జరిగిన ప్రారంభోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారని తెలిపారు. శ్రీసిటి, తిరుపతి ఆంధ్రప్రదేశ్ యొక్క సుస్థిర అభివృద్ధికి తోడ్పాటు అందించడంలో ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ నిబద్ధతను తెలియపరుస్తుందని తెలిపారు. ఈ భాగస్వామ్యం పై ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సిఈఓ, అభిలేష్ గుప్తా మాట్లాడుతూ పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు నమ్మకమైన ఇంధన పరిష్కారాన్ని అందించే సహజ వాయువు మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి శ్రీసిటి, తిరుపతి భాగస్వామ్యం చేసుకోవటానికి మేము సంతోషిస్తున్నామని అన్నారు. గౌతమ్ ఆనంద్ రీజినల్ హెడ్ ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, వైఎస్ఆర్ జిల్లా, కడప, అన్నమయ్య అనంతపురంతో సహా ఆంధ్రప్రదేశ్‌లోని 7 జిల్లాలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్‌లను అభివృద్ధి చేస్తోందని అన్నారు. మేము ఇప్పటికే 3 లైవ్ ఎల్‌సిఎన్‌జి స్టేషన్‌లతో సహా 56 సిఎన్జి స్టేషన్‌లను ప్రారంభించామని పరిశ్రమలు తమ నివాసితుల జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయని తెలిపారు. సమాజం యొక్క స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని అన్నారు.

ఇస్కాన్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినిలు

తిరుపతి విద్య, ఆగస్టు 27, ప్రభాతవార్త

శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని తిరుపతిలోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థునిలు 16 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన విద్యార్థినిలను కళాశాల ప్రిన్సిపల్ అభినందించారు. ఎందరో అవతార మూర్తుల గురించి పురాణాలు మనకు వివరించాయని అందరిలో ప్రత్యేక విలక్షణమూర్తి శ్రీకృష్ణుడని ఆయన బాల్యం లీల మాధుర్యానికి ఆటపట్టని, ఆయన బోధించిన భగవద్గీత పరమాద్భుతమని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, చర్చాగోష్ఠి విజేతలు పి. భారతి, కె. కావ్య, బి. సాయి, మహిత, కె. భువనేశ్వరి, వి. భవిత, లావణ్య, ఎస్. అక్షయ, పి. మానస, బి. మౌనిష, ఎం. మాయ శ్రీ, కె. మోహిత, ఎం. హరిత, ఎం. సంజన, టి. మునిసరిత, అభినందన సంస్కృత అధ్యాపకులు భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా పోస్టర్లు ఆవిష్కరణ

తిరుపతి విద్య, ఆగస్టు 27, ప్రభాతవార్త

డ్రగ్స్, ధూమపానం, మధ్యపానం తదితరాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశానుసారం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో వర్సిటీ ఇంచార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, సిడిసి డీన్ వర్శిటీ కళాశాల ప్రిన్సిపల్స్ చేతుల మీదుగా డ్రగ్స్ ఫ్రీ ఇండియా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వర్శిటీ ఉపకులపతి రిజిస్ట్రార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలలో డ్రగ్స్, మధ్యపానం, ధూమపానం వంటి వాటిపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించబోతున్నట్లు వారు తెలిపారు. మాదక ద్రవ్యాలు తీసుకున్న వారిపై మానసిక, శారీరక అనారోగ్యాలతో పాటు, అసహజ ప్రవర్తనలు కలిగి సమాజం పై కోలుకొని తీవ్రమైన ప్రభావాలు చూపుతున్నాయన్నారు. దీనిపై వర్శిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 29న వక్తృత్వ పోటీలు, 30న క్విజ్, 31న ర్యాలీలు నిర్వహించబోతున్నామని తెలిఎపారు. ఈ కార్యక్రమంలో సిడిసి డీన్ ఆచార్య చంద్ర నాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దామోదరం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రచారంగా సభ్యత్వనమోదు విజయవంతం చేద్దాం

తిరుపతిటౌన్, ఆగస్ట్ 27ప్రభాతవార్త:

కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం, ప్రధాని మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రచారంగా తిరుపతి జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని బీజెపి నాయకులు తెలిపారు. ఇప్పటివరకు ఉన్న సభ్యత్వాన్ని రద్దుచేసి కొత్తగా ప్రతి ఒక్కరు. సభ్యత్వం తీసుకునేలా చూడాలని అన్నారు. పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమంపై మంగళవారం సాయంత్రం అసెంబ్లీ కన్వీనర్ అజయకుమార్ ఆధ్వర్యంలో నాయకులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, గుండాల గోపీనాథరెడ్డి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, విజయకుమార్, సుబ్రమణ్యంరెడ్డి, బాల,కవిత,భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదు 1వతేదీ నుండి చేపట్టి, విజయవంతంగా చేయాలన్నారు.

శ్మశానం దారి ఆక్రమణలపై విచారణ

నగరి, ఆగస్టు 27 ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధి నెత్తం కండ్రిగ వద్ద శ్మశానంకు వెళ్లే దారిలో తుడా వారు గోడ కడుతున్నారని తమకు దారి లేదని స్థానికులు తహసీల్దార్‌కార్యాలయంలో ఫిర్యాదు చేసిన మేరకు అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం నెత్తంకండ్రిగకు వెళ్లిన తుడా భూసేకరణ అధికారి సుజన, రిటైర్డ్ కలెక్టర్‌లు డీవీఎస్ రెడ్డి, బాలయ్య, తహసీల్దార్ రవికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి నీరజాక్షి శ్మశానంలో గోడ కడుతున్న స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, సర్వేయర్, నెత్తంకండ్రిగ వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో ఆర్ఎస్ఎస్ ప్రముఖ్

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో తిరుపతిజిల్లా బిజెపి అధ్యక్షుడు బి.చంద్రప్ప స్వాగతం ఏర్పాటు చేసారు. ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యాలయంలో సీమ సురక్ష శాఖలో పని చేస్తున్న మురళీధర్ రాగా దక్షిణ గోపురం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ పిఆర్ఓ రవి ఏర్పాటు చేసారు.

తిరుపతి డివిజన్

వాణిజ్య పన్నులశాఖలో బదిలీలను వాయిదా వేయాలి

–2.0పునర్వ్యవస్థీకరణ పేరిట జరిగిన తప్పిదాలపై విచారణ చేయాలి

తిరుపతిరూరల్, ఆగస్టు 27, ప్రభాతవార్త

వాణిజ్య పన్నులశాఖలో చేపట్టిన బదిలీలను వాయిదా వేసి, శాఖాపరంగా 2.0 పునర్వస్థీకరణ పేరిట జరిగిన తప్పిదాలపై విచారణ జరిపించాలని ఉద్యోగులు డిమాండ్ చేసారు. ఈ మేరకు మంగళవారం భోజన విరామ సమయంలో ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేసారు. ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ టాక్స్‌స్ సర్వీసెస్ అసోసియేషన్ చిత్తూరు డివిజన్ అధ్యక్షులు టి. పూర్ణం మాట్లాడుతూ గత 5సంవత్సరాలలో వాణిజ్య పన్నుల శాఖల్లో జరిగిన అక్రమాలపై ధర్యాప్తు జరిపించాలని, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారుల అవినీతిపై ఎ.సి.బి ధర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసారు. ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలని, రాజ్యాంగ వ్యతిరేకంగా, రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేయాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ పునర్వవస్థీకరణ పేరుతో జరిగిన అరాచకం, విధ్వంసంపై ధర్యాప్తు చేయాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఛీఫ్ కమీషనర్ కార్యాలయంలో గత 5సంవత్సరాలలో జరిగిన అక్రమాలపై ధర్యాప్తు చేయాలన్నారు. జీఎస్టీఓలకు చట్టబద్ధమైన అధికారులు కల్పించాలని, రీజనల్ ఆఫీసులను రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల బదిలీలపై శాశ్వత విధానం రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైజెపి ప్రసాదరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై ముందస్తు ప్రణాళిక అవసరం

పాకాల, ఆగస్టు 27, ప్రభాతవార్త

పాకాల మండలం విద్యాశాఖాధికారి బాబ్జి మంగళవారం ఆయన మండలంలోని బందార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ప్రతి ఉపాధ్యాయుడు తాము ఏ పాఠం చెప్పాలో ముందుగా నిర్ణయించుకొని, దానికి సంబంధించిన పాఠ్య ప్రణాళికను తయారు చేసుకుంటే పాఠం చెప్పడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ఒక డైరీ పెట్టుకొని తాను చెప్పే పాఠంలోని ముఖ్యమైన అంశాల్ని రాసుకొని విద్యార్థులకు తెలియచేయాలని కోరారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుల కొరకు టైం టేబుల్ విద్యార్థులు కొరకు మరొక టైం టేబుల్ ఏర్పాటు చేసి నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలని తెలిపారు. ప్రత

భక్తివాతావరణంలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠ, పూజలు

-కమిటీలకు నిర్వాహకులు వినతి

తిరుపతిటౌన్, ఆగస్ట్ 27 ప్రభాతవార్త:

పుణ్యక్షేతం తిరుపతిలో సెప్టెంబర్ 7వతేదీ వినాయకచవితి పర్వదినాన వినాయక విగ్రహాలు ఏర్పాటు, పూజలు మొత్తం భక్తివాతావరణంలో జరుపుకోవాలని ఆయా కమిటీలకు వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సూచించింది, విగ్రహాలు ఏర్పాటు, పూజలు జరిగే మూడు,ఐదు,తొమ్మిదిరోజులు మండపాల వద్ద రికార్డుడ్యాన్స్‌లు, సినిమాపాటలు నిషేధమన్నారు. భక్తిపూర్వక వాతావరణంలో పూజలు జరుపుకోవాలన్నారు. మంగళవారం వినాయక నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, కరాటే శ్రీనివాస్, ఎస్వీఎం వెంకటేశ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఊకా విజయకుమార్, కొండ చెంగారెడ్డి, సాకంప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొని వినాయక చవితి పండులను సామూహిక నిమజ్జనాలను ఘనంగా జరుపుకోవడంపై చర్చించారు.

కన్నుల పండుగలా వేణు మాధవుడి కళ్యాణోత్సవం

చౌడేపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త

స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలుడికి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. గోకులాష్టమి వేడుకల్లో భాగంగా రెండవ రోజున ఆలయంలో ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. సమీపంలోని మండపంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు నిర్వాహకులు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

సిఎం కార్యదర్శిని కలసిన ద్రవిడ వి.సి. ఆచార్య దొరస్వామి

కుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు కార్యదర్శి ప్రద్యుమ్నను ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్‌లు సచివాలయం లో కలిశారు. ఈసందర్భంగా వారు ద్రవిడ వర్సిటీలో జీతాలకు సంబంధించిన గ్రాంటు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలకు సంబంధించి చర్చించారు. అలాగే రాష్ట్ర ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను కలసి వేతనాల విషయ ంగా చర్చించారు. అందుకు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు త్వరగా నిధులు విడుదలయ్యేలా చూస్తామని పేర్కొన్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య దొరసా స్వామి తెలిపారు.

రెవా రిసార్ట్‌లో కన్నడ సినిమా షూటింగ్ కోసం పరిశీలన

పాలసముద్రం, ఆగస్టు 27 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం కృష్ణజిమ్మాపురం పంచాయతీ రేవా రిసార్ట్‌లో కర్నాటక రాష్ట్రంకు చెందిన శ్రీ మునేశ్వర కరుప విద్యశ్రీ ప్రొడక్షన్‌లో డైరెక్టర్ బాలు హులికర సినిమా షూటింగ్ కోసం స్థలాలను పరిశీలించారు. ఈ సినిమాలో హీరోగా లక్ష్మీతి బాలాజీ, హీరోయిన్‌గా విద్యశ్రీలు నటిస్తున్నారని డైరెక్టర్ బాలు తెలిపారు. అన్ని భాషల్లో మంచి పల్లెటూరు కథలో ఈ సినిమా తీస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాకు ప్రొడ్యుసర్‌గా బెంగళూరుకు చెందిన బసవరాజు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందని, పాలసముద్రం మండలంలోని ప్రాంతాలను సినిమాలో పల్లెటూరి ప్రాంతంగా తెరకెక్కిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి రామ్‌ప్రసాద్, నాయకులు శ్రీనురాజు, సుబ్రమణ్యంరాజు, సుబ్రమణ్యం మందడి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై 'రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు'

చంద్రగిరి, ఆగస్టు 27 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయం త్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపీనాథ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు ఏ.వై.ఎల్.ఎన్. శ్రీనివాసాచార్యులు, అధ్యాపక రవిచంద్రన్, పరిచారిక నల్లురి విష్ణుమూర్తి, జమేదర్ మంకు చిరంజీవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తా

ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త

కంగుంది పంచాయతీలోని రాములగుట్టచేను, అంబాపురం గ్రామాల్లో ఉన్న గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం అంబాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జమీందారుల నుంచి వచ్చిన అవార్డు భూములకు సంబంధించి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పూర్తిస్థాయిలో పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంగా కంగుంది జమీ ందారీవంశస్తులతో మాట్లాడతామన్నారు. గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఏళ్ల తరబడి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈకేంద్రం ద్వారా రైతులకు వ్యవసాయం, వంగడాలు, విత్తనాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం విజలాపురం సమీప ంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు. 1100 ఎకరాల్లో ఎయిర్‌పోర్ట్ నిరి ర్మించడం జరుగుతుందని తద్వారా పరిశ్రమలు వస్తాయన్నారు. దీంతో స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కుప్పంలో యువతకు ఉపాధి కోసం రెండు వేల ఎకరాల్లో పరిశ్రమలు, సెజ్, ఆటోమొబైల్,ఎలక్ట్రానిక్ క్లస్టర్, మెగాఫుడ్ పార్క్ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కుప్పం అభివృద్ధికి సహకరించాలని కోరారు.అంతకుముందు గిడ్డేగానిపెంట, అంబాపురంలకు ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభించారు. సమావేశంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్, మండల టిడిపి అధ్యక్షుడు వికాస్ మర్మత్, తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఓ సాయిలహరి, స్థానిక నేతలు

పుంగనూరుకు వస్తాం... అభివృద్ధి తెస్తాం

పుంగనూరు,ఆగస్టు 27 ప్రభాతవార్త

రాష్ట్రంలో అన్ని విధాలా ఎదగాల్సిన పుంగనూరును స్వార్థానికి వాడుకున్నారని, పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పౌరవిమానశాఖా మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు,రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గనులశాఖా మంత్రి కొల్లురవీంద్రలు స్పష్టంచేశారు.ముందు నుంచి ఆర్వీటిబాబు రాష్ట్రస్థాయిలో వీరితో ఉన్న పరిచయాలతో మంగళవారం పుంగనూరు తెలుగుదేశం నాయకుడు ఆర్వీటి నగేష్‌బాబు వీరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో వారు ముచ్చటిస్తూ పుంగనూరు పేరు చెప్పుకుని ఎదగడమే తప్ప,పుంగనూరును అభివృద్ధిచేయడానికి గత ప్రభుత్వంలో నాయకులు చిత్తశుద్ధితో పనిచేయలేదన్నారు. రాష్ట్రానికి చివరగా ఉన్న పుంగనూరులో పరిశ్రమలు ఏర్పాటచేయడానికి ప్రభుత్వం సంకల్పిం చేందుకు సిద్ధంగా ఉందన్నారు. పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సార ధ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుంగనూరు నియోజకవర్గాన్ని ఉన్నతిలోనికి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పుంగనూరులో గత ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతి, ప్రాజెక్టుల భాగోతం, వివిధ అభివృద్ధి పథకాలపేరుతో జరిగిన అవినీతి వ్యవహారాలపై కూడా ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేసి చర్యలు తీసుకునే యత్నంలో ఉన్నట్లు తెలిసింది.రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌బాబులను బుధవారం కలవనున్న ఆర్వీటిబాబు పార్టీ విధానాలకు మద్దతుగా విరాళాలు

మరుగుదొడ్ల ఫోటోల బాధ్యతను టీచర్ల నుండి తొలగింపు

- డిఇఓకు యుటిఎఫ్ నాయకుల వినతి

చిత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త:

ఉపాధ్యాయులను బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ప్రత్యేకించి మరుగుదొడ్ల ఫోటోలు తీసే బాధ్యతను టీచర్ల నుండి తొలగించాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులును కలిసి విజ్ఞప్తి చేశారు. డిఇఓ కార్యాలయంలో మంగళవారం డిఇఓ దేవరాజులును యుటిఎఫ్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మరుగుదొడ్ల ఫోటోలు తీసే కార్యక్రమం నుండి టీచర్లను తొలగించాలని గత ప్రభుత్వంలో పోరాటం చేశామని, ప్రస్తుత ప్రభుత్వం ఈ బాధ్యతల నుండి టీచర్లను తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ ఫోటోలు ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, సిబ్బంది చేత చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, అలాగే ప్రతి రోజు సాయంత్రం 3 నుండి 3.30 గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తి చేసి హెడ్మాస్టర్లు అప్‌లోడ్ చేయాలని చెప్పారన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది ఫోటోలు తీయకుంటే హెడ్మాస్టర్లు బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. మరుగుదొడ్ల బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో ప్రభుత్వం నుండి ఉపాధ్యాయులపై మరింత భారం పడటం యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. డిఇఓ దేవరాజులును కలిసిన వారిలో యుటిఎఫ్ నాయకులు ఎస్.మణిగండన్, జగన్మోహన్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, ఎస్‌పి భాషా, పార్థసారథి, గణేష్‌కుమార్, సాధన్‌కుమార్, రవీంద్ర, సురేష్‌బాబు, శ్రీరాములు తదితరులు వున్నారు.

ఉపాధిహామీ తనిఖీలో రూ, 2లక్షల 36వేలు రికవరీ చేస్తాం..

డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ప్రజా వేదికలో వెల్లడి..

డక్కిలి,ఆగష్టు 27,ప్రభాతవార్తః

డక్కిలి మండలంలో ఈఏడాది జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలో రూ, 2లక్షల 36వేలు రికవరీ చేస్తున్నట్లు తిరుపతి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు.స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక జరిగింది.ఈసందర్భంగా పలువురు డీఆర్పీలు గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను చదివి వినిపించారు.పంచాయతీలు వారిగా సామాజిక తనిఖీ సిబ్బంది వివరిస్తుండగా డ్వామా పీడీఓ పనులు వారిగా వివరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.ప్రజా బహిరంగ వేదిక అనంతరం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద రూ, 1కోట్లు రూపాయలు పనులు జరిగినట్లు వివరించారు. ఇందులో సామాజిక తనిఖీ సిబ్బంది విచారణలో రూ,2లక్షల 36వేలు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చోటు చేసుకుందన్నారు.బాధ్యులపై త్వరలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.మండలంలో 98శాతం పనులు సక్రమంగా జరిగినట్లు విచారణలో గుర్తించమన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం ,బాధ్యతారాహిత్యం తదితర కారణాలతో ఒకటి ంరెండు గ్రామాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. రాబోయే రోజుల్లో అక్రమాలకు చోటు లేకుండా మరింత పారదర్శకంగా ఉపాధిహామీ పథకం పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వర ప్రసాద్,ఎంపీడీఓ ప్రసన్నకుమారి,ఎంపీపీ గోను రాజశేఖర్,ఏపీఓ లక్ష్మీనారాయణ,ఈసీ దామోదర్‌రాజు, ఎస్సార్పీ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక అభివృద్ధికి రాజకీయ గ్రహణం ఎందుకు?

అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున తాము అధికారంలో ఉన్నపుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని నిర్మాణ కార్యక్రమాలు చేపట్టి అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తి చేయటానికి రాజకీయ గ్రహణం కల్గించటం తగదని అభివృద్ధి పనులకు రాజకీయాలతో ముడిపెట్ట కూడదని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు శివమెత్తారు. పట్టణానికే తలమా నికంగా ఉండాలనే లక్ష్యంతో పనులు చేపట్టామని అయితే తమ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని ఆధునీకరణ పనులు ఆపివేయటం శోచనీయం అన్నారు. ఇక్కడ రూ.2.9కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. ఇటీవల ఆడికృత్తిక సందర్భంగా అధికారులు పనులు ఆపివేసారని తరువాత ఎక్కడ పనులు అక్కడ ఆపివేయటం తగదన్నారు. అయితే అధికారులు పనులు ఎందుకు ఆపారో చెప్పరు? మరి కోట్లరూపాయల పనులను చేపట్టగా రాజకీయాల కారణంగా ఆపటం శోచనీయం అన్నారు. పలు సంస్కరణలను చేపట్టిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు.

జాతీయ రెజ్లింగ్‌పోటీలకు 22 మంది విద్యార్థులు ఎంపిక

వడమాలపేట, ఆగస్టు 27 ప్రభాతవార్త: జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు 22 మంది వడమాల పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు జరిగాయి. అండర్ 11,13,15 జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట విద్యార్థులు 13 బంగారు, 9 రజిత(వెండి), 9 కాంస్య పతకాలు సాధించి తిరుపతి జిల్లాకు చాంఫియన్ షిప్ రావడానికి కారణమయ్యారు. వీరిలో బంగారు రజత పతకాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు మొదటి వారంలో హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరుగు జాతీయ గ్రాప్లింగ్‌రెజ్లింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

న బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

తనుష్(24 కేజీలు), అశ్వంత్(27 కేజీలు), సంతోష్ యాదవ్(27 కేజీలు), సతీష్(53 కేజీలు), గుణశ్రీ(40 కేజీలు), అంజలి(34 కేజీలు), ప్రియదర్శిని(37 కేజీలు), యశ్వంతి(80 కేజీలు), భాను ప్రకాష్(47 కేజీలు), ఉదయ్‌కుమార్(66 కేజీలు), పూడి శ్రవణ్ కుమార్(90 కేజీలు), విశాల్(59 కేజీలు), అనస్(42 కేజీలు), రజిత పతకాలు సాధించిన వారు మోహిత్ (30 కేజీలు), ధనుష్(34 కేజీలు), దేవ హర్ష(27 కేజీలు), మునీంద్ర(27 కేజీలు), లోకనాథం(34 కేజీలు, షణ్ముగం(55 కేజీలు, యశస్విని(38 కేజీలు), సంతోష్(59 కేజీలు), యుగంధర్(42 కేజీలు) కాంస్య పతకాలు.

నగరంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 27,ప్రభాతవార్తః

నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళ వారం తెల్లవారు జామున నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని గురువారెడ్డి సమాధుల సమీపంలో గల మాస్టర్ గది వద్ద ముఖ ఆధారిత హాజరును పరిశీలించారు. ఆలస్యంగా విధులకు హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం నగరంలోని వైఎస్ఆర్ మార్గం, లక్ష్మీపురం కూడలి, ఎయిర్ బైపాస్ రోడ్డు, ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నగరంలో ఎక్కడా చెత్త వేయకుండా చూడాలని అన్నారు. నగరంలో రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి అపరాధ రుసుము విధించాలని అన్నారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్త తొలగించాలని యజమానులకు నోటీసులు ఇచ్చినా తొలగించని వారిని మరోమారు హెచ్చరించాలని అన్నారు. అప్పటికి వారు స్పందించకపోతే మీరే తొలగించి అపరాధ రుసుము విధించి, వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈ సంజయ్ కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.

సింహ వాహనంపై ఆరేటమ్మ దివ్యతేజం

పుత్తూరురూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన గ్రామదేవత శ్రీ ఆరేటమ్మ అమ్మవారు మంగళవారం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయంలోని అమ్మవారికి ఉదయం నుంచి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

న గ్రామదేవత ఆరేటమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

గ్రామదేవత ఆరేటమ్మ ఉత్సవ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరై స్వహస్తాలతో అమ్మవారికి పాలాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి ఎమ్మెల్యేకి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే గంగజాతర కమిటీ వారు ఆలయం వద్దకు చేరుకుని బజారు వీధిలో నిర్వహించే గంగజాతరకు ఆహ్వాన పత్రికను అందించారు.

రాజన్న ఫౌండేషన్‌కు టైం గోల్డ్ అవార్డు...

రేణిగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త:

అమర రాజా కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహింపబడుతున్న రాజన్న ఫౌండేషన్‌కు నైపుణ్యాభివృద్ధి విభాగంలో అతి ప్రతిష్టాత్మకమైన సీఎస్ఆర్ టైం గోల్డ్స్ 2024 అవార్డు లభించింది. ఈ అవార్డును రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి గోవా రాష్ట్రం రాజభవన్ రాజ్ దర్బార్ హాలులో గోవా ముఖ్యమంత్రి డా. ప్రమోద్ సావంత్, రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు సదానంద చేతుల మీదుగా అందుకున్నారు. రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ 2014లో రాజన్న ఫౌండేషన్ స్థాపించామన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 2000 మంది యువతి, యువకులకు అనేక విభాగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా వారందరికి ఉద్యోగ అవకాశాలతో పాటు ఉద్యోగ భద్రతను కల్పించగలిగామన్నారు.

మంచినీటి సమస్యకే తొలి ప్రాధాన్యత

-ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తొట్టంబేడు, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలో మంచినీటి సమస్యకే తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎక్కడ ఏగ్రామంలో అయినా మంచినీటి సమస్య ఉన్నా వెంటనే తమకు తొలిచేయాలని ఎంపిపి ఉన్నం నిర్మల, జడ్పీటిసి అర్చనాదేవి, ఎంపిడిఓ సురేష్‌బాబులు సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు తెలిపారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఇటీవల ఒకేరోజు మండలంలోని 27 పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయతీల్లోని గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై కొద్దిసేపు రసాభాస సాగింది. గ్రామసభలు జరిగినపుడు కొందరు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకపోవడం మరోవైపు అధికారులకు మూడు, నాలుగు పంచాయతీలకు అధికారిగా వేయడం కనీసం సమయం కూడా ఇవ్వకుండా ఎలాగా చార్టు ప్రిపేర్ చేస్తారని పలువురు ఎంపిడిఓను నిలదీశారు. సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ తాను శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తిరూరల్, తొట్టంబేడు మండలాలకు సిడిపిఓగా పనిచేస్తున్నానని అయితే మూడు మండలాల్లో తను విధులు కేటాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఇలాంటి గ్రామసభలు నిర్వహించేటపుడు తమ వద్ద ఉన్న సూపర్‌వైజర్లకు కూడా విధులు కేటాయిస్తే హాజరవుతారన్నారు. పొయ్య పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రానికి కేవలం ఇప్పటి వరకు రూ.4లక్షలు మాత్రమే మంజూరయ్యాయని అయితే పత్రికల్లో రూ.12లక్షలు నిధులు స్వాహాచేశారని పత్రికల్లో రాయడం బాధాకరం అన్నారు. చిన్నారులను వద్దనుకున్న వారు తిరుపతి శిశువిహార్‌లోను, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తిలో ఉన్న చిల్డ్రన్స్ హోంలు ఉంచుతామన్నారు. కేంద్రప్రభుత్వం పథకమైన మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు లేని చిన్నారులకు రూ.4వేలు ప్రతినెలా అందిస్తుందన్నారు. రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రం ప్రమాదకరపరిస్థితుల్లో ఉందని అంగన్‌వాడీ కేంద్రంలో పైపెచ్చులు ఊడి చిన్నారులపై పడే అవకాశం ఉందన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఎఈ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజిఎస్ పథకం కింద రోడ్డు పనులకు రూ.2కోట్లు పనులుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఏపిఓ సుజాత మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో వరపకాలువలు, కొత్తపంటకాలువలు తవ్వకం, పొలంగట్ల తవ్వకాలు, ఫారంఫండ్స్, వ్యక్తిగత భూములకు సరిహద్దులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎంఈవో భారతీ మాట్లాడుతూ మండలంలో మొత్తం 76 పాఠశాలలు ఉన్నాయని అన్ని పాఠశాలలకు విద్యార్థులకు కిట్‌లను అందించామన్నారు. పిహెచ్‌సి వైద్యాదికారి లహరి మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం వివిధశాఖల వారు తమ నివేదికలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు కన్నలిమల్లిక, గరటారెడ్డి, కోఆప్షన్ సభ్యులు ప్రేమ్‌కుమార్, ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, సూపరింటెండెంట్ మధు తదితరులతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.